A1TV NEWS

నేటి ఆంధ్రప్రగతి
APTEL 2023/16425
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)
సెల్: 8121133006
9494220260
ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 147ం శనివారం 23 డిసెంబర్ 2023 పేజీలు 4. వేల :4 /

# ఏపీలో కాంగ్రెస్
## గేమ్ చేంజర్‌గా మారనుందా..?

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 22:

మొన్నటి వరకు ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పుంజుకుంటుంది అంటే ఎవరికి కనీసం నమ్మకం కూడా లేదు. ఎందుకంటే తనస్వయంకృత అపరాధం లా ఆంధ్రప్రదేశ్లో పార్టీని చంపేసుకున్న కాంగ్రెస్ ఇక పూర్తిగా ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల నుంచి అంతర్దానం అయిపోతుందనే భావించారు.అయితే క్రమంగా తన గ్రాఫ్ పెంచుకుంటున్న కాంగ్రెస్ ఒకపక్క కర్ణాటకను, మరోపక్క తెలంగాణను కూడా హస్త గతం చేసుకోవడంతో ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానం దృష్టి ఆంధ్ర ప్రదేశ్ పైనే పడిందట.

అయితే ఇప్పుడు ఉన్నట్టుండి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేంత పరిస్థితులు లేవు కానీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో వైసీపీ వర్సెస్ టిడిపి - జనసేన గా నడుస్తున్న కాంబినేషన్ ను మాత్రం కాంగ్రెస్ త్రిముక పోటీగా మారుస్తుందన్న అంచనాలు ప్రస్తుతం వినిపిస్తున్నాయి. ఎందుకంటే 151 ఎమ్మెల్యేలలో దాదాపు 60 నుంచి 70% సిట్టింగ్ ఎమ్మెల్యేలను వైసిపి మారుస్తుందని ప్రచారం జరుగుతున్న దరిమిలా వారిలో ఎవరికీ తెలుగుదేశం జనసేన టికెట్లను కేటాయించే పరిస్థితులు లేకపోవడంతో ఇప్పుడు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అవసరం ఆంధ్ర ప్రదేశ్ లో కనిపిస్తుంది. సరిగ్గా ఈ అవకాశాన్ని కాంగ్రెస్ రెండు చేతులా అందుపుచ్చుకోవాలని చూస్తున్నట్లుగా తెలుస్తుంది. భాజపా ఎలాగో ఆంధ్రప్రదేశ్ లో నోటతో పోటీపడుతుంది కనుక ఆ పార్టీలోకి చేరడానికి ఇష్టం లేని వారందరికీ కాంగ్రెస్ ప్రధాన ఆప్షనుగా మారే అవకాశం ఉంటుందన్నది రాజకీయ విశ్లేషకులు అంచనా.

దాంతో కీలకమైన నేతలు అందరిని కలుపుకొని గట్టిగా ప్రయత్నిస్తే కనీసం పది నుంచి 15 ఎమ్మెల్యేలను గెలుచుకున్నా కూడా కాంగ్రెస్ గేమ్ చేంజర్ గా మారటానికి అవకాశం ఉంటుంది. ఎందుకంటే ముక్కోణపు పోటీల్లో అతి తక్కువ సీట్లతోనే ప్రభుత్వం ఏర్పడుతుందన్న అంచనాలు ఉన్నాయి. దాంతో కనీస సంఖ్యలో ఎమ్మెల్యేలను గనక కాంగ్రెస్ గెలుచుకుంటే కచ్చితంగా ఆంధ్రప్రదేశ్లో చక్రం తిప్పడానికి కాంగ్రెస్కు అవకాశం ఉంటుందన్నది రాజకీయ విశ్లేషకులు మాట. ఇది కాంగ్రెస్కు అద్భుతమైన అవకాశమని, అందిపుచ్చుకుంటే కనుక అంతకుమించి కాంగ్రెస్ పుంజుకోవడానికి సరైన సమయం లేదన్నది కొంతమంది వాదన

# ఏసీబీ వలకు చిక్కిన అవినీతి ఎలక్ట్రికల్ చేప.

-రైతు పొలంలో బోర్ కోసం లంచం డిమాండ్.
-రూ 70 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎలక్ట్రికల్ సబ్ ఇంజనీర్ ప్రసాద్.

ఆంధ్ర ప్రగతి మండపేట డిసెంబర్ 22:
మారేడుబాక విద్యుత్ సబ్ స్టేషన్ లో పనిచేసే సబ్ ఇంజనీర్ ప్రసాద్ ఏసీబీ వలలో శుక్రవారం పట్టుబడ్డారు. అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య చెప్పిన కథనం ప్రకారం దుళ్ళ గ్రామానికి చెందిన ముల్లపూడి శ్రీనివాసరావు తన మామయ్య ముత్యాల గోపాలకృష్ణకు గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. నీటిపారుదల సౌకర్యం లేకపోవడంతో తన మామ పంట పొలంలో బోర్ వేయడానికి విద్యుత్ అధికారులను ఆశ్రయించారు. వీటికి సంబంధించిన ఎస్టిమేషన్ వేయడానికి దరఖాస్తు ప్రాసెస్ చేయడానికి సబ్ ఇంజనీర్ ప్రసాద్ 70000 రూపాయలు లంచం అడగడం జరిగింది. నెలలు గడుస్తున్న ఎస్టిమేషన్ స్లిప్ ఇవ్వకపోవడంతో ఈ విషయాన్ని రాజమండ్రి ఏసీబీ అధికారులకు రైతు శ్రీనివాస్ ఫిర్యాదు చేయడం జరిగింది. అడిషనల్ ఎస్పీ సౌజన్య పథకం ప్రకారం శు క్రవారం శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఏసీబీ అధికారులు సబ్ స్టేషన్ వద్ద మాటు వేశారు. ముందుగా రూపొందించిన పథకం ప్రకారం ముళ్ళపూడి శ్రీనివాసరావు 70000 రూపాయల నగదు సబ్ స్టేషన్ లో ఉన్న సబ్ ఇంజనీర్ ప్రసాద్ కు అందజేశారు. వెంటనే ఆయన తన డైరీలో ఆ నగదు పెట్టుకోవడం జరిగింది. ఊహించని రీతిలో



మెరుపు దాడి చేసిన అడిషనల్ ఎస్పీ సౌజన్య రెడ్ హ్యాండెడ్ గా లంచం తీసుకున్న ప్రసాద్ ను డబ్బుతో సహా పట్టివేశారు. ఈ సంఘటన మండపేటలో సంచలనం రేకెత్తించింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సౌజన్య మాట్లాడుతూ ప్రజల పనులను అధికారులు డబ్బులు లేకుండా నిస్వార్థంగా చేపట్టాలని ఈ విధంగా స్వార్థ బుద్ధితో లంచం తీసుకుంటే శిక్షకు గురవుతారని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ కార్యాలయాలు అన్ని జిల్లాల్లో ఉన్నాయని ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే ముందుగా తమను ఆశ్రయించాలని ఆమె కోరారు. సబ్ ఇంజనీర్ ప్రసాద్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ ఏసీబీ దాడిలో ఇన్స్పెక్టర్లు వాసుకృష్ణ, సతీష్ , శ్రీనివాస్ ఎస్సై విల్సన్ ఏసీబీ సిబ్బంది ఉన్నారు.

# ఏపీలో మరో కొత్త పార్టీ ఆవిర్భావం.




ఆంధ్ర ప్రగతి విజయవాడ డిసెంబర్ 22:

మరికొన్ని రోజుల్లో ఆంధ్రప్రదేశ్లో ఎన్నికలు జరగనుండగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సరికొత్త రాజకీయ పార్టీని స్థాపించారు.జై భారత్ నేషనల్ పార్టీ పేరుతో తన పార్టీ పేరును శుక్రవారం రాత్రి ప్రకటించారు. ఇది సాధారణంగా పెట్టిన పార్టీ కాదు... ప్రజల్లోంచి పుట్టిన పార్టీ అన్నారు. మాజీ జేడీ లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా తేవడం కోసమే తమ పార్టీ పుట్టిందన్నారు. ఎవరూ అవినీతి చెయ్యలేని విధంగా చూడడానికి పుట్టిన పార్టీ జై భారత్ పార్టీ అని పేర్కొన్నారు. ఒకరు అభివృద్ధి పేరుతో ఒక నగరం కట్టడాన్ని లక్ష్యంగా ఒకరు పని చేశారు. అవసరాల పేరుతో అభివృద్ధి ని పక్కన పెట్టింది మరొకరు.. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చెయ్యడానికి తాను పార్టీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జై భారత్ నేషనల్ పార్టీ జెండాను మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. పార్టీ జెండాలో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు ఉన్నాయి. లక్ష్మీ నారాయణ పిడికిలి బిగించినట్లుగా ఉన్న ఫొటో సైతం జై భారత్ నేషనల్ పార్టీ జెండాలో ముద్రించి ఉండటం మీరు గమనించవచ్చు.

ప్రజాస్వామ్యంలో ప్రజల అభిమతాన్ని ముందుకు తీసుకు వెళ్లడానికి పార్టీ పెడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకు రావడానికి తన పార్టీ నాంది పలుకుతుందన్నారు. దేశంలో రాజకీయ పార్టీల పరిస్థితి అయోమయంగా ఉందని, రాజకీయాలంటే ప్రజల్ని మోసం చేయడమే అనే అభిప్రాయం అందరిలోకి వెళ్ళిపోయిందన్నారు. రాజకీయాలు అంటే సుపరిపాలన అని చెప్పడమే జై భారత్ నేషనల్ పార్టీ సిద్ధాంతమని లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా విషయమై ఏపీ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగానికి అసలు కారణం ప్రత్యేక హోదా రాకపోవడమే అని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ లో ప్రత్యేక హోదాపై ప్రశ్నించడానికి 3 సార్లు అవకాశం వచ్చినా, అయినా అడిగే ధైర్యం రాష్ట్రం లో ఎవరికీ లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

దేశంలో యువత అధికంగా ఉన్నారని, ఏపీలోని యువతకు ఉద్యోగాలు రాకపోవడానికి రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోవడమే కారణమని ఆరోపించారు. రాజకీయాల గురించి చులకనగా మాట్లాడే పరిస్థితి ఉందన్నారు. ఏపీ ప్రజలు ఎవరికీ బానిసలు కాదని, మన హక్కుల్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు ప్రజల్లోంచి పుట్టుకొచ్చింది తమ పార్టీ అన్నారు.

సీబీఐలో జాయింట్ డైరెక్టర్ స్థాయికి వెళ్లి లక్ష్మీ నారాయణ సేవలు అందించారు. ఆపై ఐపీఎస్ కు రాజీనామా చేసిన ఆయన పాలిటిక్స్ లోకి వచ్చారు. 2019లో జనసేన పార్టీ నుంచి వైజాగ్ ఎంపీగా లక్ష్మీనారాయణ పోటీచేసి ఓడిపోయిన తర్వాత అక్కడే కొంత కాలం పని చేసుకున్నారు. కానీ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మళ్లీ సినిమాలు చేస్తున్నారన్న కారణంగా జనసేనకు రాజీనామా చేశారు. కొంతకాలం రైతు, ప్రజా సమస్యలు, యువత ఓటింగ్ పై అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచే పోటీ చేస్తానని చెప్పిన లక్ష్మీనారాయణ.. తాజాగా జై భారత్ నేషనల్ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

# కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్-1 పై సీఎం జగన్ సమీక్ష.



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 22:

జేఎన్-1 వేరియంట్‌పై పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న అధికారులు.

ఎలాంటి కాంప్లికేషన్స్ లేకుండానే ఈ కోవిడ్ వేరియంట్ సోకినవారు రికవరీ అవుతున్నారని వెల్లడించిన అధికారులు.

ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే కోలుకుంటున్నారని అధికారులు తెలిపారు.డెల్టా వేరియంట్ తరహా లక్షణాలు లేవని తేల్చిన అధికారులు.అయితే జేఎన్%--%1కు వేగంగా విస్తరించే లక్షణం ఉందని వివరణ.లక్షణాలు ఉన్నవారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేస్తున్నామని తెలిపారు.పాజిటివ్ వచ్చిన శాంపిల్లను విజయవాడ జీనోమ్ ల్యాబ్‌లో పరిశీలిస్తున్నాము. 4లో...

# టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో చండీయాగం సుదర్శన నారసింహా హోమం.



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 22తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి నివాసంలో శుక్రవారం చండీయాగం, సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు.

శుక్రవారం నుండి మూడు రోజుల పాటు జరిగే శతచండీ పారాయణ ఏకోత్తర వృద్ధి మహాచండీ యాగం, సుదర్శన నారసింహ హోమంలో భాగంగా మొదటి రోజు యజ్ఞ క్రతువులు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజలు హోమాలు జరిపారు. ప్రజలందరికీ మేలు జరగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా చంద్రబాబు భువనేశ్వరి దంపతులు ప్రార్థించారు.గుంటూరుకు చెందిన వేద పండితులు శ్రీనివాసాచార్యుల వారి పర్యవేక్షణలో 40 మంది రిత్వికులు యాగం నిర్వహించారు. రేపు, ఎల్లుండి కూడా యజ్ఞహోమాది కార్యక్రమాలు జరగనున్నాయి. కృష్ణా గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు పార్టీ నేతలు కుటుంబ సభ్యులతో కలిసి యాగంలో పాల్గొన్నారు.

# పవన్ వర్సెస్ ముద్రగడ... జగన్ కొత్త ప్లాన్..!

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 22:

కాపు రిజర్వేషన్ ఉద్యమ మాజీ నాయకుడు ముద్రగడ పద్మనాభం మళ్లీ రాజకీయాల్లో క్రియాశీలకం కానున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏదో ఒక పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.వచ్చే నెలలో మళ్లీ రాజకీయాల్లో రంగ ప్రవేశం చేయనున్నారనే వార్తలు జోరందుకున్నాయి. ఈ మేరకు ఆయన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తన అభిమానులను ఆహ్వానించారు. జనవరి 1న కిర్లంపూడిలో ఉన్న తన స్వగృహానికి రావాలని పిలుపునిచ్చారు. దీంతో కీలక నిర్ణయం తీసుకుంటారనే తెలుస్తోంది. 4లో...







# పార్లమెంట్ లో బీజేపీ వైఖరిని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు.

## -అలాగే అంగన్వాడీ కార్యకర్తల సమ్మెకు మద్దతు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 22:
కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి సభ్యులను పార్లమెంట్ లో బీజేపీ ప్రభుత్వం నియతృత్వ ధోరణితో విపక్ష పార్టీల గొంతు నొక్కి అన్యాయంగా సస్పెండ్ చేశారు.

భారత దేశ సార్వభౌమధికారాన్ని ప్రజాస్వామ్య పరిరక్షణను ఖూనీ చేసి 146 ఎంపీల సస్పెన్షన్ తో బీజేపీ దుర్మార్గపు పరిపాలన విధాలను ప్రశ్నించే అవకాశం లేకుండా చేసి, వారికీ అనుకూలమైన బిల్లులు పాస్ చేసుకుని దేశాభివృద్ధికి ద్రోహం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండిస్తూ అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి సభ్యులు దేశ వ్యాప్తంగా తమ నిరసన తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా ఏఐసీసీ ఆదేశానుసారం, పిసిసి %డ% డీసీసీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నంద్యాల టౌన్ అధ్యక్షులు చింతలయ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలతో సీఐటీయూ సీపీఎం కార్మిక కర్షక పార్టీల నాయకులు కార్యకర్తలతో స్థానిక శ్రీనివాస్ సెంటర్ నందు వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. కనీస పనికి కనీస వేతనం అనే నినాదంతో అంగన్వాడీ వర్కర్స్ చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపారు.

నిరసనకు దిగిన అంగన్వాడీ కార్యకర్తలకు సంపూర్ణ మద్దతు తెలిపారు. కనీస భద్రత కల్పించాలని వైఎస్సార్సీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు , 1975 లో ఆనాడు కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాలను గానీ అందులో పనిచేసేటువంటి కార్యకర్తలు సంక్షేమం ఏరోజు కూడా ఆలోచన చేయలేదు, నికు సిగ్గుందా జగన్ మోహన్ రెడ్డి సచివాలయ ఉద్యోగులకు అంగన్వాడీ కేంద్రాలను అప్పచెప్పడం తక్షణమే అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం , లేనిచో బారి ఎత్తున ఉద్యమం చేపడతామని




హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ మసూల్దార్ ఫరూక్, రాష్ట్ర ప్రధాన సెక్రటరీ మోహన్ రావు, నంద్యాల టౌన్ అధ్యక్షులు చింతలయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి వాసు, టౌన్ ట్రెజరీ ప్రసాద్, రాష్ట్ర ఎస్ సి సెల్ కరాటే బాలకృష్ణ,
నంద్యాల జిల్లా సెక్రటరీ మసూల్దార్ అబ్దుల్ రహమాన్, సహాయ సెక్రటరీ కరీముల్లా, చేబోల్ సలాం, మైనార్టీ నాయకులు ముహమ్మద్ రఫీ, అహమ్మద్ హుస్సేన్, రాష్ట్ర సేవాదళ్ మస్తాన్ ఖాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# మహానందిలో ఏపీ అకౌంట్స్ డిపార్ట్మెంట్. ఐఏఎస్.అధికారి భాస్కర్ రెడ్డి పూజలు.

ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 22:
మహానంది పుణ్యక్షేత్రంలో వెలిసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని ఏపీ అకౌంట్స్ డిపార్ట్మెంట్. ఐఏఎస్.అధికారి భాస్కర్ రెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ మధు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఏఈఓ శేష వస్త్రంతో సత్కరించగా, పేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట తెలుగంగ డీఈలు రవీంద్రారెడ్డి, హరిప్రసాద్,ఆలయ టెంపుల్ ఇన్స్పెక్టర్ బత్తుల నాగభూషణంలు పాల్గొన్నారు.

# 11వరోజు అంగన్వాడీలు నిరవధిక సమ్మె.

ఆంధ్ర ప్రగతి పాణ్యం డిసెంబర్ 22:
పాణ్యం మండలం లో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్ లో అంగన్వాడి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని జరుగుతున్న 11వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా చేసి అక్కడినుండి పాణ్యం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినాదాలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి అంగన్వాడి వర్కర్స్ హ్యాండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెంకటమ్మ. అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్ హాజరై వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అంగన్వాడీల 11 రోజుల నుండి సమ్మె చేస్తున్న సమస్యలు పరిశించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్వాడి సెంటర్లను సచివాలయ సిబ్బందితో ఐకెపి వాళ్ళతో నడపాలని నిర్ణయించడం అన్యాయమని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాళాలు బద్దలు కొడితే సెంటర్లు నడవవని టీచర్లు ఆయాలు ఉంటేనే సెంటర్లో నడుస్తాయని జ్ఞానోదయం ప్రభుత్వానికి త్వరలో బోధపడుతుందని అన్నారు అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని అనేక దశలవారీగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఇంతవరకు పరిష్కారం చేయలేదని అందుకు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో



సమ్మెబాట పట్టడం జరుగుతుందని అన్నారు న్యాయమైన డిమాండ్లు అంగనవాడి లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలుపెంచాలని. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాండ్ డ్యూటీ ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ 50 లక్షలు ఇవ్వాలని వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని, అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని హెల్పర్ ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, ప్రమోషన్ లో రాజకీయ జోక్యం అరికట్టి, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, అంగన్వాడీ పిల్లలకు అమ్మ ఒడి యూనిఫామ్ ఇవ్వాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెన్ చార్జి పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని. 2017 నుండి పెండింగ్ లో ఉన్న పీఏ బిల్లులు ఇవ్వాలని లబ్ధిదారులకు న్యాయమైన ఆహారాన్ని సరఫరా చేయాలని ఆయిల్ కందిపప్పు పెంచాలని సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని సర్వీస్ లో ఉండీ చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని. బీమా అమలు చేయాలని ఈ న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయని యెడల అంగన్వాడీల సత్తా ఏంటో చూపిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అంగనవాడి టీచర్ ఆయాలు సిఐటియు మండల కార్యదర్శి కే భాస్కర్ .విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్ వెంకటమ్మ .స్వరూప మరియమ్మ .ప్రభాతమ్మ లలితమ్మ . అనసూయ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సమస్యలు నెరవేరేం తవరకు సమ్మెను కొనసాగిస్తాం.



ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 22:
రాష్ట్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత పద కొండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శుక్రవారం మహానందిలోని టోల్గేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నిరంతరం పిల్లల సంరక్షణలో ఉంటున్న అంగన్వాడీల న్యాయమైన కోరికలు తీర్చకపోవడం ప్రభుత్వ వైఫల్యమన్నారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో బతకడం కష్టం ఉందని, అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని,రోజుకో రూపంలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసనలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి, నారాయణమ్మ, ఖైరున్, గౌరీ,చండీ దేవి, మహేశ్వరి, పుష్పకళ, తదితరులు పాల్గొన్నారు.

# బాల అకాడమీ పాఠశాలలో ఘనంగా జరిగిన జాతీయ గణిత దినోత్సవపు వేడుకలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 22:
నంద్యాల జిల్లాలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో డిసెంబర్ 22వ తేదీన అనగా శుక్రవారం "జాతీయ గణిత దినోత్సవం"ను ఘనంగా జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత మేడం మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రసిద్ధి చెందిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన అపర మేధావి అయిన శ్రీనివాస రామానుజన్ గారు 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఈ రోడ్ లో జన్మించారు. కఠిన పేదరికాన్ని అనుభవించిన ఆయన ఏనాడు లెక్కల్ని మాత్రం వదల్లేదు. ప్రతిక్షణం వాటిని ఆలోచిస్తూ వాటిని చేస్తూ అవి జీవితంగా మలుచుకున్నారు. ఆయన ఆలోచనలు చేసిన లెక్కలు వేసిన ఫార్ములాలు అన్ని ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాయి. అందుకే గణిత శాస్త్రంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జయంతిని "జాతీయ గణిత దినోత్సవము"గా జరుపుకుంటున్నాము. ఆయన "మ్యాథ్స్ జీనియస్" గా కూడా పేరుపొందారు అని తెలియజేస్తూ ఉపాధ్యాయులకు విద్యార్థులకు మరియు గణిత మేధావులు అందరికీ గణిత దినోత్సవపు శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు గణితమునకు సంబంధించిన అనేక అంశాలను తమదైన శైలిలో ప్రాజెక్టు రూపంలో తయారుచేసి ముఖ్య అతిథులను తల్లిదండ్రులను అందరినీ అబ్బురపరిచారు. ఈ కార్యక్రమమునకు పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ సార్ గారు ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత మేడం గారు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడానికి ఖండిస్తున్నాం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 22: పార్లమెంట్లో 146 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకించాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ మాట్లాడుతూ ఉన్న పార్లమెంటును కాదని కొత్త పార్లమెంటు భవనం కట్టి దీన్నిదుర్భేద్యంగా నిర్మించామని బిజెపి నాయకులు గొప్పలు చెప్పుకున్నారు .అయితే ప్రారంభంలోనే కొంతమంది నిరసనకారులు స్మోక్ బాంబులు విసిరి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ నిరసనకారులకు బిజెపి ఎంపీ అనుమతిని ఇచ్చారు .ఈ సమస్య పైన పార్లమెంటులో పార్లమెంటు భద్రత పైన ప్రశ్నలు అడిగినటువంటి విపక్ష ఎంపీలందరినీ 146 మందిని ఏకపక్షంగా సస్పెండ్ చేసి, ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యలు తీసుకొని తమకు అనుకూలమైన బిల్లులను ఆమోదింప చేసుకున్నారు. ఇందులో ఒక నియంతృత్వ బిల్లు ఎన్నికల కమిషన్ లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేకుండా అధికార పార్టీ సభ్యులనే కమిటీ సభ్యులుగా నియమిస్తూ చేసినటువంటి బిల్లుచ భవిష్యత్తులో ఏకపక్షంగా ఎన్నికలను నిర్వహించడానికి తోడ్పడుతుంది. రెండవది క్రిమినల్ అమెండ్మెంట్ చట్టంలో మార్పులు దేశద్రోహ చట్టాన్ని ఎత్తివేయాలని ఒక వైపు సుప్రీంకోర్టు చెబుతున్న అదే చట్టాన్ని మార్పులు చేసి మరింత కఠిన తరంగా ఉండేటటువంటి పద్ధతిలో ఈ క్రిమినల్ అమెండ్మెంట్ లలో చేర్చారు. ఈ చట్టం ద్వారా బిజెపి తమ ప్రత్యర్థులను నిరంకుశంగా శిక్షించడానికి ఉపయోగపడుతుంది .టెలికాం బిల్లును కూడా ప్రవేశపెడుతూ భవిష్యత్తులో టెలికాం సర్వీస్ లను పోస్టల్ సర్వీసులను ప్రైవేటీకరణ చేసేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లులను ఆమోదింప చేసుకోవడానికి 146 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేసి ఏకపక్షంగా అప్రజా స్వామికంగా ఆమోదించుకోవడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు .ఈనిరంకుశ చర్యలను సమర్థించేటువంటి రాష్ట్ర వైఎస్ఆర్సిపి పార్టీని టిడిపి పార్టీని కూడా వ్యతిరేకించాలని వారు కోరారు. సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ మాట్లాడుతూ బిజెపి నీరంకుశ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని ,భవిష్యత్తులో బిజెపి గనుక అధికారంలోకి వస్తే మైనార్టీలకు ,దళితులకు, క్రిస్టియన్లకు, వెనుకబడిన కులాల వారికి పై తీవ్రమైనటువంటి దాడులు చేస్తారని కావున బిజెపి వ్యతిరేకంగా ప్రజలందరూ నిలబడాలని వారు కోరారు. ఈ సభకు సిపిఎం పార్టీ పట్టణ నాయకులు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. సిపిఎం పార్టీ పట్టణ నాయకులు శివ, సిపిఎం పార్టీ నాయకులు సుబ్బారావుచ జైలాను తదితరులు నాయకత్వం వహించారు.




# ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ సేవలు చిరస్మరణీయం.

-సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.

ఆంధ్ర ప్రగతి డోన్ డిసెంబర్ 22: డోన్ శ్రీనివాస్ నగర్ ఎంపీపీ స్కూల్ హెచ్ఎం ఆర్ . రాము నాయక్డిసెంబర్ 22 ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అయ్యం గార్ జయంతి సందర్భంగా మరియు జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా డోన్ పట్టణం లోని శ్రీనివాస్ నగర్ లో ఎం పీ పీ స్కూల్ నందు సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో స్కూల్ హెచ్ఎం రాము నాయక్ అధ్యక్షతన శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.



# మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి కాంగ్రెస్ రావాలి గోడ పత్రిక విడుదల.

-రైతులకు మూడు లక్షల వరకు రుణమాఫీ మరియు పంటకు మద్దతు కల్పిస్తాం. -ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదాపై మొదటి సంతకం.

-వంట గ్యాస్ సిలిండర్ను 500 రూపాయలకే ఇస్తాం. -పార్లమెంట్‌లో జరిగిన ఘటనపై న్యాయ విచారణ జరపాలి.

- ఎంపీలపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలి. -కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా డిసిసి అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 22:
నంద్యాల పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ భవనంలో గోడపత్రిక విడుదల సందర్భంగా కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా డిసిసి అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి సామాన్యులకు అండా రాహుల్ గాంధీ సామాన్యులుగా ఇంటింటికి వస్తున్న కాంగ్రెస్ నాయకులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

పార్లమెంట్‌లో పొగబాంబులు వేసిన ఆగంతకులపై న్యాయ విచారణ చేయాలని మోదీ ప్రభుత్వం ఇంత నిరంకుశత్వంగా వ్యవహరించడం సరికాదని, ఇండియా కూటమికి చెందిన 150 మంది ఎంపీలను అక్రమంగా సస్పెండ్ చేసి నల్లచట్టాలను ఆమోదించడం చాలా సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

పార్లమెంట్‌లో జరిగిన ఘటనకు సంబంధించిన విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చుమంటే కేంద్ర ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీసారు. పార్లమెంట్‌లోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు బీజేపీ ఎంపీ ఇచ్చిన పాస్‌తోనే వచ్చారని విచారణ చేస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని డిమాండ్ చేసారు. 150 మంది ఎంపీలను



ఈ విచారణ చేయాలని డిమాండ్ చేస్తుంటే వారిని సస్పెండ్ చేసి నల్ల చట్టాలన ఆమోదింపచేసుకోవడం ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహం చేయడమే అన్నారు. వారందరిపై తక్షణం సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు అందరి సమక్షంలో మళ్లీ చట్టాలపై బిల్లులు ప్రవేశపెట్టి చర్చించిన తరువాతనే ఆమోదించాలని డిమాండ్ చేసారు.

రాష్ట్రంలో మోదీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న వైపిపి, టీడీపీ, జనసేన పార్టీల వైఖరిని కూడా ప్రజలందరూ గమనించాలని కోరారు.

మోదీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే వరకు దేశ వ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం తెస్తామని స్పష్టం చేసారు.

కాంగ్రెస్ కేంద్రం రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు మూడు లక్షల వరకు రుణమాఫీ మరియు పంటలకు మద్ద ధర కల్పిస్తామని. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదాపై మొదటి సంతకం చేస్తామని వంటగ్యాస్ సిలిండర్ను 500 రూపాయలకే ఇస్తామని రాయలసీమకు ఉత్తరాంధ్రకు బుందేల?ండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని.

నంద్యాల పార్లమెంట్లో ఉన్న సిద్దేశ్వరం , అలుగు సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని.

రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతాలయ్యా , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, నంద్యాల నియోజకవర్గం కో ఆర్డినేషన్ సభ్యులు ఫరూఖ్ , జిల్లా ఉపాధ్యక్షులు కరాటే బాలకృష్ణ , నంద్యాల పార్లమెంట్ మహిళ నాయకురాలు ప్రియాంక , జిల్లా ట్రెజరీ ప్రసాద్ , జిల్లా కార్యదర్శి సిరివెళ్ళ రఫీ , రాష్ట్ర సోషల్ మీడియా కో ఆర్డినేటర్ లక్ష్మన్న , జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినెటర్ యాదవ్ సంజీవ కుమార్ , ఖాదర్ , మిగతా నాయకులు పాల్గొన్నారు.

# మునిసిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 22:
రాష్ట్రంలోని మునిసిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని పెద్ద సంఖ్యలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు బదిలీలు మరియు పదోన్నతులు చేపట్టిన ప్రభుత్వం మునిసిపల్ ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేస్తోందని ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల పట్టణ శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య నాయక్ మరియు మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల పట్టణం ఎమ్మెస్ నగర్ లోని పురపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో ఏపీ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మునిసిపల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ రూపొందించి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని అన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు గవర్నమెంట్ ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలని, అర్బన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసి అర్హులైన మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణ అధికారాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు బత్తుల. ఈశ్వర రెడ్డి, రవితేజ, జమీల్ అహ్మద్, నాగ వెంకటేశ్వర్లు, గుర్రప్ప, శ్రీ జయంతి, సుగుణమ్మ, నిర్మల, మౌనిక రాణి, షబానా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపురంలో గాడి తప్పిన పారిశుద్ధ్యం.

-అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు.
-ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర పారిశుద్ధ్య లోపంతో దుర్గంధం.
-సిమెంట్ రోడ్డు మట్టి రోడ్డుగా మారి బురదమయం.
-తిమ్మాపురం గ్రామంలో దోమలతో అల్లాడుతున్న ప్రజలు.
-పారిశుద్ధ్య లోపం.. పట్టించుకోని అధికారులు.



ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 22:
శ్రీశైలం నియోజకవర్గం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర బురదమయంగా మారడంతో వృద్ధులు, పేషెంట్లు, మహిళలు, ఉద్యోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసిన పట్టించుకోలేదని, పారిశుద్ధ్య లోపంతో దోమలు అధికమయ్యాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం లోపించి దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తూ డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. సిమెంట్ రోడ్డు మట్టి రోడ్డుగా మారి బురదమయంగా మారడంతో పలు గ్రామాలనుండి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కడ కింద పడి గాయాల పాలవుతామని భయాందోళనలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీవో శివ నాగజ్యోతికి పలుసార్లు విన్నవించడం జరిగిందని ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలు గ్రామాల ప్రజలు వాపోయారు. చెవిటి వారి ముందు శంఖం ఊదిన చందంగా అధికారులు తయారయ్యారని ప్రభుత్వ ఆసుపత్రికి పలు గ్రామాల నుండి వచ్చే ప్రజలు ఆరోపించారు. గ్రామాలలో ఉన్నతాధికారుల, పాలకుల పర్యవేక్షణ లోపం ఉన్నట్లు అద్దం పట్టినట్లు కనిపిస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర నెలకొన్న పారిశుద్ధ్య సమస్యపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని గ్రామస్తులు కోరారు.



# వైసీపీ పార్టీ ఓటమే లక్ష్యంగా దూకుడు పెంచిన తెలుగుదేశం పార్టీ నాయకులు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్22:
వైసిపి పార్టీ ఓటమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కొత్తపల్లె గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంను దూకుడు పెంచి హెూరెత్తించారు. శుక్రవారం సాయంత్రం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఏన్ఎం డి ఫిరోజ్ కొత్తపల్లి గ్రామానికి చేరుకోగానే టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటి తిరుగుతూ టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రతి ఇంటికి పంచుతూ ప్రజలను చైతన్యపరిచారు. ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చేందుకు బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా గ్రామంలోని సమస్యలను ప్రజలని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆటకెక్కిందన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యం వీధిలైట్లు తాగునీరు నిర్వహణ సరిగా లేకపోవడంతో గ్రామాలు దుర్భరంగా మారాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడం తో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడిచాయన్నారు. రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రం లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసీపీ పార్టీకి బుద్ధి చెప్పి, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారాయణ, తాతిరెడ్డి మనీష్ రెడ్డి,ఒకటో వార్డు నరసింహారెడ్డి, 2 వ వార్డు వెంకటేశ్వర్ రెడ్డి, మూడో వార్డు నాగరాజు, నాలుగవ వార్డు ధనుంజయ్ గౌడ్, 5 వ వార్డు సాగం శేషారెడ్డి,12 వ వార్డు శంకర్ రెడ్డి, వీరితోపాటు డీలర్ శివ మాజీ ఎంపీటీసీ, తాతిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, నక్క చెన్నయ్య, తాతిరెడ్డి శేఖర్ రెడ్డి, చాకలి నరసింహుడు, నక్క రాజు, బొమ్మిరెడ్డి కిషోర్ రెడ్డి, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, బూతు కమిటీ సహదేవుడు, తాటివెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డిఈఓ ల పెన్షన్ బెనిఫిట్స్ ఫ్రీజ్ చేయాలి.

## -కడప ఆర్జేడి పదోన్నతి నిలిపివేయాలి-బిటిఎఫ్

డి ఈ ఓ ల పెన్షన్ బెనిఫిట్స్ ఫ్రిజ్ చేయాలని అదేవిధంగా కడప ఆర్జేడి పదోన్నతి నిలిపివేయాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు కే. సతీష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...


ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలను నడిపించాల్సిన గురుతరమైన బాధ్యత ఉన్న జిల్లా స్థాయి.. ఆ పై స్థాయి అధికారులే నిబంధనలు పాటించకపోగా.. అడ్డగోలుగా వ్యవహరించి.. సామాన్యులకు అన్యాయం తలపెట్టారు. న్యాయం చేయమంటూ.. ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటే.. అదిగో.. ఇదిగో... అంటూ.. వారాలు.. నెలలు.. ఏళ్లు గడిచినా.. కాలయాపన చేస్తూ.. బాధితుల సహనాన్ని పరీక్షించి మోసం చేశారు. కరుడు గట్టిన కిరాతకులే నయం అనేటట్లుగా దుర్మార్గంగా వ్యవహరించిన అధికారులను బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంది. అయినా ఉన్నతాధికారులు కళ్లు తెరవకపోగా.. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చినా సరే అంటూ.. దులుపేసుకుంటున్న వైనం దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. చివరకు బాధితులు న్యాయ స్థానం తలుపుతట్టేలా.. హింసించేందుకు వెనుకాడని వైనం ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖకు మాయని మచ్చగా మారబోతోంది. భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన విద్యా రంగాన్ని భ్రష్టుపట్టిస్తున్న చీడపురుగులను ఉపేక్షించడానికి ప్రయత్నిస్తే.. అధికారులే కాదు.. ప్రజలు కూడా దారుణమైన మూల్యం చెల్లించాల్సిన పరిస్థితికి దారితీస్తోంది. వివరాలు ఇప్పుడు చూద్దాం.

ఉమ్మడి కర్నూలు మరియు నంద్యాల జిల్లాలో విద్యాశాఖను సమర్థవంతంగా నడపాల్సిన ఉన్నతాధికారులే గాడితప్పి ప్రవర్తిస్తున్నారు. సీసీఏ రూల్స్ పాటించకుండా.. తమ ఇష్టారాజ్యంగా .. ఎలాంటి విచారణ చేయకుండా అక్రమంగా సస్పెండ్ చేసి.. అలవెన్సులు చెల్లించకుండా వేధిస్తున్నారు. అంతేకాదు.. నియమ నిభందనలకు వ్యతిరేకంగా అకారణంగా పదోన్నతి నిలిపివేసి చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. జిఒ 77, తేది 30.10.2019 ప్రకారం 02.11.2019న జరిగిన పదోన్నతుల్లో కుల వివక్షత చూపించారు. పదోన్నతి ఇవ్వకుండా ఉద్దేశ్యపూర్వకంగా గతంలో పనిచేసిన కర్నూలు డిఈఓ సాయిరాం వేధించారు. పలు పిర్యాదుల మేరకు 15 నెలలు ఆర్థిక నష్టం కలిగించి పదోన్నతి ఇచ్చారు. అప్పటి కర్నూలు డిఈఓ సాయిరాంతోపాటు ప్రస్తుత డిఈఓ రంగారెడ్డి ఆయన సిబ్బంది కలిసి ప్రభుత్వ నియమ నిభందనలకు విరుద్దంగా వేధింపులు చేస్తున్నారని బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

అంతేకాకుండా ఒక అడ్రస్ లేని.. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చేసిన (అనానిమస్ అనగా ఆకాశరామన్న పిర్యాదు) పిర్యాదును సాకుగా చూపి కర్నూలు డిఈఓ రంగారెడ్డి మరియు కడప ఆర్జేడి వెంకట క్రిష్ణా రెడ్డి కార్యాలయ సిబ్బంది కలిసి అక్రమంగా సి.సి.ఎ రూల్స్ కు విరుద్దంగా ఎలాంటి విచారణ చేయకుండా సస్పెండ్ చేసి, అలవెన్స్ మంజూరు చేయకుండా వేధించారు. ఇదే అంశంలో ఎస్.సి. కమీషన్ లో పలుమార్లు పిర్యాదుల చేయగా కక్షపూరితంగా సుదూర ప్రాంతంలో ఉన్న కొకర్చేడు ఉన్నత పాఠశాల, హాలహర్వి మండలానికి పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చి అక్కడే జాయిన్ కావాలని వేధిస్తున్నారు. అంతేకాదు.. ఏకంగా 14 నెలలుగా జీతాలు లేకుండా వేధిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటివలే కర్నూలు డి.ఈ.ఓ గా పనిచేస్తున్న రంగారెడ్డి ఉపాధ్యాయులకు సంబంధించిన స్పాట్ వాల్యూయేషన్ మరియు ఉపాధ్యాయుల ట్రైనింగ్ అలవెన్స్ పైకం 70 లక్షలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయని వారిపై ప్రత్యేక విచారణకు ఆదేశించాలని రాష్ట్ర విద్యాశాఖాధికారులకు విజ్ఞప్తి చేశారు.

నియమ నిభందనలకు వ్యతిరేకంగా తనను పలురకాలుగా వేధించిన కర్నూలు డిఈఓలు సాయిరాం మరియు రంగారెడ్డి ల పెన్షన్ బెనిఫిట్స్ ఫ్రీజ్ చేయాలని, కడప ఆర్జేడి వెంకట క్రిష్ణా రెడ్డి గారి ఇవ్వబోయే పదోన్నతి నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తనకు జరిగిన అన్యాయం పై జాయింట్ కలెక్టర్ చే విచారణ చేయించి న్యాయం చేయాలని లిఖితపూర్వకంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేసినట్లు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు మరియు హిందీ టీచర్ కె. సతీష్ కుమార్ తెలిపారు.



## సంపాదకీయం

# ప్రైవేట్ వ్యవహారంలా పార్లమెంట్ సమావేశాలు

శుక్రవారం 22-12-2023

ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా ఎలాంటి ప్రయోజనకరంగా లేకుండా ముగిసాయి. ఒకరోజు ముందే ముగించడం ద్వారా..అధికార బిజెపి మమ అనిపించింది. మూకుమ్మడిగా ఎంపిలను సభనుంచి వెలివేయడం ద్వారా బిజెపి మరో చరిత్ర సృష్టించింది. మొత్తంగా సమస్య ఏదైనా కావచ్చు..చర్చించడానికి వారు సిద్దంగా లేరని రుజువు చేసుకున్నారు. సమస్య ఏదైనా చర్చించడమే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. ఓ రకంగా ఇది అధికార విపక్షాల ఉమ్మడి వైఫల్యంగా చెప్పుకోవాలి. ఇరు పక్షాలు పంతాలకు, పట్టింపులకు పోయి సభా సమయాన్ని వృధా చేయడంతో పాటు, ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కారు. తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా ఎవరికి వారు సమస్యలపై చర్చకు ముందుకు రావడంలేదు. విపక్షాలకు సమాధానం ఇవ్వకుండా అనుకున్న బిల్లులను ప్రవేశ పెట్టి ప్రభుత్వం చేతులు దులుపు కుంటూ వస్తున్నా గమనించడం లేదు. ప్రధాని మోడీ సభకు రాకుండా, చర్చలో పాల్గొనకుండా ఉండడం అలవాటు చేసుకు న్నారు. అనేకానేక కార్యక్ర మాల్లో ఆయన బిజీగా ఉంటూ రానున్న ఎన్నికలపై దృష్టి సారించారు. నిజానికి పార్లమెంటులో ఉండి సమస్యలపై చర్చించి, సమాధానం ఇవ్వాల్సిన పెద్దాయన ఇంత బాధ్యతా రహితంగా ఉండడం సరైనదేనా అన్నది ప్రజలు ఆలోచించాలి. ప్రజాసమస్యలు చర్చించడానికి అత్యున్నత వేదిక అయిన పార్లమెంట్ ఇలా వృధాగా ముగియడం వల్ల నష్టపోతున్నది ప్రజలే. అవసరమైతే ప్రభుత్వాన్ని నిలదీయడానికి వీలు కల్పించే అవకాశం ఉన్నా..ఆందోళనలతో సభా సమయాన్ని వృధా చేసుకున్న విపక్షాలను కూడా క్షమించరాదు. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా విపక్షాలు చర్చలకు అవకాశం ఉన్న అంశాలను, అవకాశాలను వదులుకుంటున్నారు. గెలిపించాం కదా అని తమ ఇష్టానుసారం పార్లమెంట్‌ను నడిపించాలని చూశారు. ఇరుపక్షాలు ఉడుంపట్టుతో ఈశీతాకాలపార్లమెంట్ సమావేశాలు కూడా ఎలాంటి చర్చలు లేకుండా ముగిశాయి. మొత్తంగా చర్చకు అవకాశం కల్పించరాదన్న ధోరణిలో అధికార బిజెపి ఉంటే..చర్చ చేయకుండా రచ్చ చేసి బయటకు రావాలన్న విపక్షాల ధోరణి కారణంగా ప్రజలు బిక్కమొహం వేయాల్సి వచ్చింది. అందుకే ఇరుపక్షాల తీరు ఆందోళన కరంగా ఉంటోంది. ప్రజల సమస్యలను చర్చించాల్సిన చట్టసభల్లో అలాంటి ప్రయత్నాలు జరగడం లేదని వరుసగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలు రుజువు చేశాయి. ఎదుటి వారి విమర్శలకు ప్రతి విమర్శలు చేయడమెలా అన్న వ్యూహంలో సాగుతున్నాయి. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఏనాడూ చర్చకు అవకాశం రావడం లేదు. విపక్షం అంటే విమర్శించడం..అధికార పక్షం అంటే సమాధానం దాట వేయడం అన్న చందంగా మన చట్టసభలు సాగుతున్న తీరు పార్లమెంట్ వ్యవస్థకు మచ్చగా మారుతున్నది. పార్లమెంటును దేవాలయంగా పోల్చిన నేతలు దానిని అపవిత్రం చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం విపక్షాల బాధ్యత. దానిపై చర్చించడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఈ రెండూ నెరవేరకుండానే పార్లమెంట్ సమావేశాలు సాగుతున్న తీరు ప్రజలను ఆవేదనకు గురి చేస్తోంది. అధికారంలో ఉన్నవారే పెద్ద మనసుతో, పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించడం వల్ల ప్రజలకు మేలు జరుగు తుంది. కానీ ఇరు పక్షాలూ భీష్మించుకొని పార్లమెంటరీ ప్రతిష్టంభనకు కారణమైతే అందుకు ప్రజలు ఏమను కోవాలి. ఎందుకు ఓటేసామని అనుకోవాలి. ఇలాంటి వారిని తాము చట్టసభలకు ఎందుకు పంపామా అని తలదించుకోవాలి. ఇలాంటి వారిని ఎన్నుకోవడం అవసరమా అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఈసారి కూడా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పెద్దగా ఎలాంటి చర్చ లేకుండా ముగించేయడం ఓ రకంగా అధికార బిజెపి అహంకారానికి అద్దం పట్టాయి. అలాగే విపక్ష సభ్యుల మొండి వైఖరిని ప్రస్ఫుటం చేశాయి. పార్లమెంట్ భద్రతపై చర్చకు పట్టుబట్టడం తప్ప విపక్షాలు సాధించింది కూడా ఏమీలేదు. ఏ పార్టీ అధికారం లో ఉన్నా భద్రత విషయంలో అప్రమత్తత అన్నది భద్రతాబలగాలు చూసుకుంటాయి. భద్రతా బలగాలు ఎల్లవేళలా అప్రమత్తంగానే ఉంటారన్నది పార్లమెంట్ సభ్యులు తెలుసుకోవాలి. కాపలాకాస్తున్న భద్రతా బలగాలు తమ ప్రాణాలను ఒడ్డి సభ్యులను రక్షిస్తుంటారు. నిరంతరం సభను స్తంభింపచేయడమే తమ విజయమని విపక్షాలు భావిస్తున్నట్లుగా ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించాల్సిన అత్యున్నత వేదిక తన బాధ్యతను చేపట్టడంలో విఫలమవుతోందా అని ఆలోచించే సమయం వచ్చింది. కరోనా మళ్లీ విజృంభి స్తోంది. ప్రజలకు కేంద్రం మరోమారు హెచ్చరికలు చేసింది. కరోనా కేసులు పెరగడం ప్రపంచాన్ని ఆందోళన కలిగిస్తోంది. దీనిపై చర్చకు పట్టు బట్టాల్సింది. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న వడ్డీరేట్లు, జిఎస్టీ వడ్డింపులు తదితర ఎన్నో సమస్యలను ప్రజలు ఎదుర్కొంటు న్నారు. వీటిపై ప్రభుత్వాన్ని నిలదీసేలా సమస్యలపై చర్చకు వ్యూహం లేకుండా విపక్షం వ్యవహరించడం సిగ్గుచేటు. మొత్తంగా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కూడా ఎలాంటి ఫలితాలన్ని చూపకుండా పోయాయనే చెప్పుకోవాలి. చట్టసభల్లో చర్చల కన్నా వాదోపవాదాలు, గందరగోళాలే ఎక్కువ సమయం వృధా జరుగుతోంది. పార్లమెంట్ సభ్యులను ఎన్నుకున్నది ఇందుకేనా అన్న ఆవేదన ప్రజలకు కలుగుతోంది. అధికార పక్షం, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా ఎవరికి వారు తమకు తోచిన విధంగా పార్లమెంట్ సమావేశాలను సాగకుండా దోహదపడ్డారు. సమస్యలను చర్చించడమే చట్టసభలకు, సభ్యులకు మహోన్నత లక్ష్యం కావాల్సి ఉండగా గందనగోళం సృష్టించి సభలను వాయిదా వేయించడమే తమ లక్ష్యంగా ముందుకు సాగాయి. పార్లమెంట్ శీతకాల సమావేశాలు తీరు చూసినప్పుడు ఆవేదన కలగక మానదు.

# అమరావతి..పోలవరంల కథ కంచికేనా?

అమరావతి,డిసెంబర్22(ఆర్ఎన్ఎ):

అమరావతి రాజధాని ఉద్యమానికి దీటుగా రాయలసీమ, ఉత్తరాంధ్రలో కృత్రిమ ఉద్యమాలను ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రారంభించాక కూడా ..మూడు రాజధానుల కల సాకారం కాలేదు. ఐదేళు కావస్తున్నాయి. మరోమారు ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. అయినా రాజధాని సమస్య తేలలేదు. పోలవరం పూర్తి కాలేదు. 'అమరావతి వద్దు - మూడు రాజధానులు ముద్దు' అని నినాదాలు చేయిస్తున్న వారు..చేసిన వారు కూడా ఇప్పుడు రాజధాని ఏదంటే చెప్పలేని దుస్థితిలో ఉన్నారు. కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేస్తే చాలు రాయలసీమ అంతా అభివృద్ధి చెందుతుందని ప్రజలను భ్రమింపచేసే ప్రయత్నాలు చేశారు. జగన్ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటుతోంది. రాయలసీమలో అభివృద్ధికి సంబంధించి ఒక్క ప్రతిపాదన కూడా పురుడు పోసుకోలేదు. కొత్తగా ఒక్క పరిశ్రమకు కూడా శంకుస్థాపన జరగలేదు. నిజానికి రాయలసీమ అభివృద్ధి చెందాలంటే ముందుగా సాగునీటి వసతులు పెంచాలన్న డిమాండ్‌ను పక్కన పెట్టారు. ఆర్భాటంగా ప్రకటించిన రాయలసీమ ఎత్తిపోతల పథకం పురిట్లోనే ఆగిపోయింది. ఈ పథకాన్ని చేపట్టడానికి వీల్లేదని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ తేల్చి చెప్పింది. రాయలసీమ అభివృద్ధిని కాంక్షించే మేధావులకు ఈ అంశం పట్టడం లేదు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసింది. ఈ వివాదాన్ని పరిష్కరించుకునే ప్రయత్నం మాత్రం చేయరు. రాయలసీమ మేధావులు కూడా ఈ విషయమై ముఖ్యమంత్రిని ప్రశ్నించడం లేదు. రాష్ట్రప్రజలంతా చెల్లించే పన్నులతో అమరావతినే అభివృద్ధి చేస్తే మిగతా ప్రాంతాలు ఏం కావాలని మంత్రులు ప్రకటనలు చేస్తూ వచ్చారు. ఇదంతా కేవలం జగన్ ఆదేశాలతోనే అని అనుకోవాల్సిందే. అందుకు తగ్గట్లుగా సమావేశాలతో ప్రజల్లో ప్రాంతీయ వాదాలను ఉసిగొల్పుతూ వచ్చారు. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసారు. అమరావతి రైతుల ఉద్యమం ప్రజల్లోకి వెళ్లడంతో కొత్త తరహా ఎత్తుగడలు వేసారు. అయిదేళ్ల క్రితం అన్ని రాజకీయపార్టీలూ అంగీకరించి నిర్మాణాలను కూడా ప్రారంభించిన రాజధాని అమరావతిని వివాదాస్పదం చేశారు. కులగజ్జి అంటూ రచ్చ చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే మూడు రాజధానులు ఉండాలనే ఆచరణసాధ్యం కాని విధానాన్ని తెరమీదకు తెచ్చారు. విశాఖలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటు చేస్తే రాయలసీమ ఎలా అభివృద్ధి చెందుతుందో ఆందోళన చేస్తున్నవారు చెప్పడంలేదు. హైదరాబాద్‌లో అభివృద్ధి అంతా సైబరాబాద్‌లో కేంద్రీకృతం అవుతోంది. బడా వ్యాపారసంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు కొలువుదీరడమే ఇందుకు కారణం అని వాదించారు. ఈ వాస్తవాన్ని మరుగుపరచి, ప్రజల్లో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా అభివృద్ధిని పక్కన పెట్టారు. బటన్ నొక్కడం, డబ్బులు పంచడమే పాలన అన్న చందంగా ఐదేళుగా కాలయాపన చేశారు. ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానులను అభివృద్ధి చేయాలని ఉంటే... తన వద్ద ఉన్న కార్యాచరణ ప్రణాళిక ఏమిటో చెప్పాలి. అమరావతికి భూములు ఇచ్చిన రైతుల సమస్యను పరిష్కరించకుండా మూడు రాజధానుల విషయంలో ప్రకటనలు చేయడం ఎంతవరకు సబబో చెప్పాలి. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నీటివనరులు ఉండాలి. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు కావాలి. వీటిపై ముందు దృష్టి పెట్టకుండా భ్రమలు కల్పించడం తగదు. పోలవరం అడుగు కూడా పడలేదు. ఈ పదేళ్ల కాలంలో పోలవరం పూర్తి చేయకపోవడం దౌర్భాగ్యం కాక మరోటి కాదు. జాతీయ ప్రాజెక్టును నెత్తిన వేసుకుని లబ్ది పొందాలన్న చంద్రబాబు కారణంగానే ఆదిలోనే దీనికి అడ్డదారులు పడ్డాయి. మొత్తంగా విడివడ్డ ఎపికి రాజధాని రాలేదు. జీవనాడి అనుకున్న పోలవరం పూర్తి కాలేదు. పాలకుల తీరు కారణంగా ఈ రెండు ప్రాజెక్టులు పట్టాలకు ఎక్కలేదనడంలో సందేహం లేదు.

# పవన్ వర్సెస్ ముద్రగడ... జగన్ కొత్త ప్లాన్..!

ముద్రగడ కాపు రిజర్వేష్ ఉద్యమం నడిపడానికి ముందు ఎన్నెన్నో రాజకీయ పదవులు పొందారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. 2014 రాష్ట్ర విభజన తర్వాత కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని అందుకున్నారు. తుని రైలు విధ్వంస ఘటనతో ఉద్యమం మరింత ఎగిసి పడింది. అయితే వందలాదిమై కేసులు నమోదు అయ్యాయి. రాజకీయంగా టీడీపీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

గత ఎన్నికల్లో టీడీపీ ఓటమికి కాపులు కూడా ఓ కారణం అని చెప్పవచ్చు. పవన్ కల్యాణ్ టీడీపీతో విభేదించడం, బీజేపీ దూరం పెట్టడం వంటి పరిణామాలతో టీడీపీ తన అధికారాన్ని కోల్పోయింది. దీంతో ఈసారి ఎలాగైన అధికారాన్ని చేజిక్కించుకోవాలని జనసేనతో పొత్తు పెట్టుకొని కాపులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాన్ని చంద్రబాబు మొదలు పెట్టారు. దీనికి కౌంటర్ గా వైసీపీముద్రగడ తో సంప్రదింపులు జరుపుతోంది.

పవన్ కు కౌంటర్ గా ముద్రగడను తమ పార్టీలోకి తీసుకుంటే కాపు ఓట్లు చీలవని వైసీపీ అభిప్రాయపడుతోంది. తుని ఘటనతో కాపులు టీడీపీపై కోపంతో ఉన్నారు. మరోవైపు ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేన ప్రభావం గట్టిగానే ఉంది. దీనిని తగ్గించాలంటే ముద్రగడ ను అక్కడ నుంచి ఎంపీ బరిలో ఉంచాలని వైసీపీ భావిస్తోందంట. ఇదే నిజమైతే ముద్రగడ కాపు ఉద్యమ నాయకుడు నుంచి వైసీపీ నేతగా మారిపోతారు. దీనివల్ల ఆయనకు నష్టం జరుగుతుందా లేక లాభం జరుగుతుందా అంటే ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే.

# కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్–1 పై సీఎం జగన్ సమీక్ష.

కొత్త వేరియంట్లను గుర్తించడానికి ఈ పరీక్షలు దోహదం చేస్తున్నాయని వెల్లడి.
గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ర్యాపిడ్ టెస్టింగ్ కిట్స్ పెడుతున్నామన్న అధికారులు.
అలాగే ఆస్పత్రుల్లో పర్సనల్ కేర్ కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.
అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయనితెలిపారు.
ప్రభుత్వ పరంగా ముందస్తు చర్యల్లో భాగంగా ఆక్సిజన్ ఇన్‌ఫ్రాను సిద్ధంచేస్తున్నామని వెల్లడి.
పీఎస్ఏ ప్లాంట్లు నడిపి సత్వర వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడి.
అలాగే ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు, డి%--%టైప్ సిలిండర్లు కూడా సిద్ధంచేశామని వెల్లడి.
56,741 ఆక్సిజన్ బెడ్లు కూడా సిద్ధంగా ఉన్నాయని వెల్లడి.
ఈ సందర్భంగా సీఎం జగన్ స్పందిస్తూ.
ఈ వేరియంట్ వల్ల ఆందోళన అనవసరమని వైద్యులు చెప్తున్నారు
ముందస్తు చర్యల పట్ల దృష్టిపెట్టాలి.
అత్యంత బలంగా ఉన్న గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థను విలేజ్ క్లినిక్ వ్యవస్థను ముందస్తు చర్యలకోసం అలర్ట్ చేయాలి.
కొత్తవేరియంట్ లక్షణాలు, తీసుకోవాల్సిన చర్యలపై విలేజ్ క్లినిక్స్ స్టాఫ్‌కు అవగాహన కల్పించాలి.
ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం.

# కేటాయించిన పని దినాలు పూర్తి చేయాలి: ఎన్ఆర్ఇజిఎస్ పిడి

చాగలమర్రి: డిసెంబర్ 22:ఐ



జాతీయ స్థాయిలో నికరమైన పని దినాలు కావాల్సిన వారికే ఉపాధిహామి జాబ్ కార్డలు మంజూరు చేయాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారని నంద్యాల జిల్లా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక ఉపాధిహామి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షల 8 వేల జాబ్ కార్డులను మంజూరు చేశామన్నారు. వారిలో కొన్ని కుటుంబాలు 90 రోజులు మాత్రమే పనిచేయడం జరిగిందన్నారు. అలాంటి వారికి 100 రోజులు పని కల్పించాలని కలేక్టర్ ఆదేశించారన్నారు. జాబ్ కార్డులు కలిగిన కొంత మందికి పనిచేయాల్సిన అవసరం లేక పోవడంతో వారు పనికి హాజరు కావడం లేదన్నారు. అలాంటి వారిని గుర్తించి వారి జాబ్ కార్డులను తాత్కాలి కంగ తోలగించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను పలుమార్లు ఆదేశించినా వారు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వీరిపై శాఖాపరమైన చర్యలు చేపడతామని ఆయన సూచించారు. అలాగే జాబ్ కార్డు దారులు వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్ సిడింగ్, మ్యాపింగ్ వచ్చే ఏడాది జనవరి నెల 1వ తేదీకల్లా చేయించుకోకుంటే వారి ఖతాలో కూలీ డబ్బులు జమా కావన్నారు. అలా చేయించుకోలేక పోయిన వారు రూ.250/-లు నగదు చెలించి ఆయా గ్రామాలలోని పోస్టాఫీసులో కొత్తగా ఖాతా బు తెరచుకోవచ్చున్నారు. ఈ ఏడాది 300 ఏకరాలలో సబ్సిడీ ద్వారా పండ్ల మొక్కుల పెంపకం 600ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటల పెంపకం చేపట్టాలని ఉన్నత అధికారులు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వం ఉపాధిహామి పథకం ద్వారా రైతులు ఉద్యానవన పంటలతో పాటు ఫారం ఫాండ్స్, 1 ఏకరం విస్తీర్ణంలో మిని అమృత్ సరోవర్లను ఏక్కువగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతే కాకుండా మండలంలో చేపట్టిన 27 రూఫెఫ్. హార్వేస్టర్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహమ్మద్ దోలా,ఎపిఒ నిర్మలాదేవి టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటయ్య ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పివి సంస్కరణలే నేటికీ దిక్సూచి

**దేశగతిని మార్చిన అపర మేధావి**

**భారతరత్న ఇవ్వకుండా సంకుచిత రాజకీయాలు**

**నేడు పివి వర్ధంతి సందర్భంగా...**

హైదరాబాద్,డిసెంబర్22(

భారతదేశ ఆర్థిక స్థితిగతులను అనూహ్యంగా మార్చి పారిశ్రామిక ప్రగతికి గేట్లు తెరిచిన ఆర్థిక సంస్కర్త దివంగత పివి నరసింహారావు. అందుకే దేశం ఇవాళ విదేశాలతో పోటీ పడేలా చేయడం తన దూరదృష్టితో నిర్ణయాలు తీసుకున్నారు. ఆయన డిసెంబర్ 23న మరణించారు. ఆయన మరణంతో దేశం గొప్ప మేధావిని కోల్పోయింది. ఆర్థిక పరిస్థితులను అంచనా వేసుకు న్నప్పుడు పివికి ముందు పివి తరవాత అన్న లెక్కలు వేసుకునే స్థితి చెప్పుకోక తప్పదు. రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వాలు కలిగినవారు బహు అరుదుగా ఉంటారని పివి తనరాజకీయ జీవితంలో నిరూపిం చారు. అలాగే పదవుల కోసం వెంపర్లాడుతున్న నేటి రాజకీయాల్లో పదవులు వాటంతటవే వెతుక్కుంటూ రావడం...వాటికి వన్నె తేవడం కూడా బహు అరుదు. ఓ మహానుభావుడు రాకుంటే భారత ఆర్థికస్థితి ఏమయ్యేదో అన్న ఆలోచన లేకుండా అలాంటి మహానుభావుడు పివి రూపంలో భారతదేశానికి సాక్షాత్కరించడం కూడా దేశం చేసుకున్న అదృష్టంగా చూడాలి. నిజానికి ఎక్కడో వరంగల్ జిల్లా వంగరలో పుట్టి దేశానికి దిక్సూచిగా అయిన తీరు గమనిస్తే ఎక్కడా ఆయన రాజకీయాలు చేయలేదు. రాజకీయాలు ఆయన అవసరాన్ని గుర్తించాయి. ఇందిర అయినా...రాజీవ్ అయినా ఆయనలోని అపార ప్రతిభను గుర్తించి చేరదీసారే తప్ప మరోటి కాదు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత ఉన్న అరుదైన నేతల్లో పివి ముందుంటారు. ఆయన స్వార్థం కోసం ఏనాడూ రాజకీయాలు చేయలేదు. అలాగే ఆయనలోని స్వార్థం దేశానికి మంచి చేయాలన్న తపన తప్ప మరోటి కాదు. రాజకీయాల్లో రాణించడం కోసం ఎత్తులు పై ఎత్తులు వేస్తూ..ఎదుటి వారిని బురిడీ కొట్టించడం....అవసరమైతే ప్రత్యర్థులను మట్టుపెట్టడం లాంటి నేటి రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడు దివంగత పివి నరసింహారావు.



ఆయన ప్రధాని గా ఉన్నకాలంలో చేపట్టిన ఆర్థిక సంస్కరణలే ఇవాళ దేశానికి అన్నం పెడుతున్నాయి. మన యువత విదేశాలకు ఉద్యోగాల వేటకు వెళ్లగలుగుతున్నారు. ఆయన రాజకీయాల్లో స్వశక్తితతో,ప్రతిభతో రాణించారే తప్ప అడుగులకు మడుగులు ఒత్తి రాలేదు. ఆ మహానభావుడు మన తెలుగు వాడైనందుకు మనమంతా గర్వపడాలి. అలాంటి రాజకీయవేత్త ఒకరు భారత ప్రధాని అయినందుకు మనమంతా ఎంతో అదృష్ట వంతులం. అలాంటి వ్యక్తిని నీచాతినీచంగా అవమానించిన ఘనత కాంగ్రెస్‌ది, దాని అధినేత్రి సోనియాది. పివి కాంగ్రెస్‌కు ఎంతో పేరు తెచ్చారు. ఆయన పాలనా సంస్కరణలతో దేశానికి అలాగే కాంగ్రెస్ పార్టీకి చరిత్రలో లిఖించదగ్గ ఘట్టాలను అందించారు. సానుకూల, ప్రతికూల రాజకీయాలను ఆమూలాగ్రం ఔపోసన పట్టిన ఘటికుడు ఆయన. అందుకే వాటిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పాలన చేసి..తిరుగలేని నేతగా రుజువు చేసుకున్నారు. నిజానికి పివి హయాం తరవాత సంకీర్ణాలు మొదలయ్యాయి. పివి కూడా ఆనాడు సంకీర్ణ రాజకీయాలకు తెరతీసి ఉంటే దేవేగౌడ స్థానంలో మళ్లీ పివియే ప్రధాని అయ్యేవారు. తనకున్న స్థానాలతో తానే మరోమారు ప్రధానిగా అయ్యేందుకు సంకీర్ణ రాజకీయాలు నెరపి ఉంటే భారత చరిత్ర మరోలా ఉండేది. ఆయనకు ఆనాడు ఈ ఆలోచన రాక కాదు. కానీ కుళ్లు రాజకీయాలు మోయడం ఇష్టం లేకే ఆయన అలాంటి ప్రతిపాదనలు చేసి ఉండక పోవచ్చు.అయినా ఆయన పాలనా కాలం ఓ స్వర్ణయుగం. ముఖ్యమంత్రిగా,కేంద్రమంత్రిగా,ప్రధాన మంత్రిగా,ఆర్థిక సంస్కరణ లను అద్వితీయంగా అమలుపరిచిన పాలనాదక్షుడు పీవీ నరసింహరావు. అందుకే బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ,ఊహించని రీతిలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మార్కెట్ సరళీకరణ విధానాన్ని రూపొందించి భారత్‌కు మార్గాన్ని చూపారు. ఇప్పుడా మార్గంలోనే మన ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది. ఆయన చూపిన బాట నుంచి పక్కకు తప్పినప్పుడల్లా మళ్లీ సంక్షోభాలు ఎదుర్కొంటున్నాం. పీవీ జీవిత కాలంలో అనేక సందర్భాలలో, ఆయనను తక్కువగా అంచనా వేసిన కాంగ్రెస్ ఇక ఎప్పటికీ కోలుకోదు. ఆయనకు చేసిన అవమానం అంతాఇంతా కాదు. కానీ పదవుల కోసం వెంపర్లాడే వారు పివిని ఆవమానించినా పట్టించు కోకుండా మిన్నకుండి ఇవాళ ఆయన గురించి మాట్లాడుతున్నారు.ఆయనను భారతరత్నతో గౌరవించాలన్న డిమాండ్ ఉన్నా...సంకుచిత రాజకీయాల కారణంగా దూరం పెట్టారు.